క్లుప్తంగా

ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులు : ఎంపీపీ



శివాపురం(పెనుగంచిప్రోలు: ప్రాధాన్యతా క్రమంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎంపీపీ మార్కపూడి గాంధీ తెలిపారు. మండలంలోని శివాపురం ఎస్సీకాలనీలో డ్రైనేజీ, కల్వర్టు నిర్మాణం చేపట్టాల్సిన స్థలాన్ని, వాటర్‌ట్యాంక్‌కు నూతనంగా ఏర్పాటు చేసిన ఇనుప నిచ్చెనను బుధవారం ఆయన పరిశీలించారు. డ్రైనేజీ కల్వర్టు నిర్మాణానికి సంబంధించి సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు లగడపాటి జనార్ధన్, నాయకులు లగడపాటి సురేష్, నిరంజన్, ఇంజం రవి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

1489 మందికి కంటి పరీక్షలు

పెనుగంచిప్రోలు: స్థానిక రాధాకృష్ణ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జయప్రద ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. మొత్తం 1489 మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి 501మందికి కళ్లజోళ్లు, 271 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ఆపరేషన్లు అవసరమైనవారికి త్వరలోనే శంకర్ కంటి ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయిస్తామని వివరించారు. ఫౌండేషన్ కోఆర్డినేటర్ కట్టా నరసింహారావు, మండల టీడీపీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, సొసైటీ అధ్యక్షులు కర్ల వెంకటనారాయణ, మాజీ ఎంపీపీ వేగినేటి గోసాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన ఉండాలి

పెనుగంచిప్రోలు: చట్టాలపై మహిళలు అవగాహన ఉండాలని ఐసీడీఎస్ జిల్లా సమన్వయ అధికారి పి.లక్ష్మీభార్గవి సూచించారు. స్థానిక రామాలయ కల్యాణ మండపంలో బుధవారం సంకల్ప 10 రోజుల అవగాహన కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా బాల్య వివాహాల కారణంగా కలిగే నష్టాలు, మహిళల చట్టాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ చిల్లకల్లు ప్రాజెక్టు సీడీపీఓ సత్యవతి మాట్లాడుతూ బాలిక విద్య ప్రాధాన్యాన్ని గుర్తించి వారిని చదివించాలని తల్లిదండ్రులను కోరారు. డీసీపీఓ రాజేశ్వరరావు మాట్లాడుతూ పోక్సోచట్టం, గృహ హింస చట్టాలను వివరించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ సరళ, వైద్యాధికారి నాగరాణి, న్యాయవాది కిరణ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రజని, వెంకటకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు, తల్లులు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

పెనుగంచిప్రోలు: రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలని ఏవో కె.రామసుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని ముచ్చింతాల, గుమ్మడిదుర్రు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమానింన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈ-క్రాప్ చేయించుకోవాలన్నారు. రైతులు మొదటి విడత పంటలకు యూరియా వేసిన తరువాత రెండో విడత నానో యూరియా స్ప్రే చేసుకోవాలని సూచించారు. వరి పంటలో ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు, విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కళ్లజోళ్ల పంపిణీ

నందిగామరూరల్: జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ శాసన మండలి సభ్యుడు తొండపు దశరధ జనార్దన్ పేర్కొన్నారు. మండలంలోని కొండూరు, రామిరెడ్డిపల్లి గ్రామాల్లో జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేయించుకున్నవారి బుధవారం కళ్లజోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, ఫౌండేషన్ చైర్మన్ టీడీ జనార్దన్, సీఈవో చెరుకూరి చాముండేశ్వరి, వైద్యులు నాదెళ్ల వేణు, కేతినేని శైలజ, వరుణ్, రమ్య, నాయకులు తోట నాగేమల్లేశ్వరరావు, మన్నే కళావతి, అబ్బూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కోతులు బాబోయ్ కోతులు

- బెంబేలెత్తుతున్న పేరకలపాడు ఎస్సీకాలనీ వాసులు
- 10 రోజుల వ్యవధిలో 20మందిని గాయపరిచిన కోతులు
- ఇళ్లలోని వస్తువులను నష్టపరుస్తున్న వైనం
- పట్టించుకోని పంచాయతీ పాలకులు
- భయాందోళనలో జనం



పేరకలపాడు ఎస్సీకాలనీలో సంచరిస్తున్న కోతులు

కంచికచర్ల: మండలంలోని పేరకలపాడు ఎస్సీ కాలనీవాసులు కోతుల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత పదిరోజుల్లో కోతులు 20మందిని గాయపరచడంతో కాలనీవాసులు బెంబేలెత్తిపోతున్నారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు ఈ కోతుల బారినపడి గాయాలపాలయ్యారు. గుంపులు గుంపులుగా ఉన్న కోతులు ఇళ్లలోకి చొరబడుతూ వస్తువులను నాశనం చేస్తుండటంతోపాటు కాలనీవాసులను కూడా గాయపరుస్తున్నాయి.

ఆస్పత్రిపాలవుతున్న జనం..

ఇటీవల కాలనీకి చెందిన జూపల్లి సావిత్రి, జూపల్లి పద్మ, సొంగం అక్కమ్మ, కోడెరెక్క భాగ్యరాజు, బండి మునిలి, కోడిరెక్క దిబ్బమ్మ, గంజిలంక సీతారావమ్మ, బురదగుంట దుర్గ తదితరులు కోతుల బారినపడి గాయపడ్డారు. వీరంతా కంచికచర్ల పీహెచ్‌సీతోపాటు పలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి వైద్యం చేయించుకున్నారు. వృద్ధులతోపాటు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే చిన్నారులపై ఈ కోతులు దాడికి పాల్పడుతుండటంతో ఇళ్లల్లోంచి బయటికి రావాలంటేనే జనం జంకుతున్నారు. కోతుల బెడద రోజురోజుకు తీవ్రతరమవుతుండటంతో చేతుల్లో కర్రలు పట్టుకుని సంచరించాల్సిన పరిస్థితి ఏర్పడిందని కాలనీవాసులు వాపోతున్నారు. కోతుల బారి నుంచి తమను కాపాడాలని పలుమార్లు పంచాయతీ పాలకులు, అధికారులకు మొరపెట్టుకున్నా వారు పట్టించుకోలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పెద్దపెద్ద శబ్దాలు చేసుకుంటూ మూకుమ్మడిగా ఇళ్లలోకి జొరబడుతున్న కోతులను చూసి మహిళలు, చిన్నారులు భయాందోళనలకు గురవుతున్నారు. దుకాణాల నుంచి నిత్యావసర సరుకులు తీసుకువస్తున్నా...చిన్నారుల చేతుల్లో తినే వస్తువులు ఉన్నా కోతులు వెంటబడి లాక్కెళ్తున్నాయని మహిళలు చెబుతున్నారు.



కోతుల దాడి భయంతో చేతుల్లో కర్రలు పట్టుకుని కూర్చొన్న కాలనీవాసులు

నిధులు లేవని చేతులెత్తేసిన సర్పంచి..

తమ కాలనీలో అధికంగా ఉన్న కోతుల సమస్యను పరిష్కరించాలంటూ సర్పంచిని కోరగా కోతులను తరిమేందుకు పంచాయతీ ఖజానాలో డబ్బులు లేవని సర్పంచి బదులిచ్చారని కాలనీవాసులు పేర్కొనడం గమనార్హం. సమస్యను ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఆమె కూడా పట్టించుకోలేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి కోతుల బారి నుంచి తమను కాపాడాలని పేరకలపాడు ఎస్సీకాలనీవాసులు కోరుతున్నారు.

తప్పిపోయిన దివ్యాంగ బాలుడు

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని అనిగండ్లపాడు గ్రామానికి చెందిన దైద సన్ని అనే 16ఏళ్ల బాలుడు కనిపించకుండా పోయిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పుట్టుకతో చెవిటి, మూగ అయిన సన్ని మూడునెలలుగా ఇబ్రహీంపట్నంలోని ఓ దివ్యాంగుల సంస్థలో ఉంటున్నాడు. ఈనెల పింఛన్ కోసం అనిగండ్లపాడు వచ్చి వెళ్లాడు, ఈక్రమంలో ఈనెల 8న అతను సంస్థ నుంచి వెళ్లిపోయినట్లు సంస్థ నిర్వాహకులు సమాచారం ఇచ్చినట్లు సన్ని తండ్రి జ్యోతిబాబు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. సన్నీ ఆచూకీ తెలిసినవారు సెల్‌నంబరు 88977 14478కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

పాఠశాల తనిఖీ



కెఅగ్రహారం(జగ్గయ్యపేట): విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంఈవో-2 చిట్టిబాబు సూచించారు.కె.అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. చిట్టిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనమందించాలన్నారు. ఉపాధ్యాయులు సకాలంలో సిలబస్ పూర్తి చేయటంతోపాటు సమయపాలన పాటించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గోవిందస్, ఉపాధ్యాయులు చారి, రాజేంద్ర, నాగమణి, ఉషాహరిణి పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

చిల్లకల్లు(జగ్గయ్యపేట): పాము కాటుతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చిల్లకల్లులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నల్లగడ్డ నాగేశ్వరరావు (62) పంట పొలంలో గడ్డి కోసేందుకు వెళ్లి పాముకాటుకు గురయ్యాడు. ఈక్రమంలో నాగేశ్వరరావు కేకలు వేయడంతో గమనించిన స్థానికులు అయనను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

వాహనాల తనిఖీ

వీరులపాడు: మండలంలోని జుజ్జూరు గ్రామశివారులో ఎస్ఐ అనిల్ బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన ధ్రువీకరణపత్రాలు లేని పలువురు వాహనచోదకులకు జరిమానా విధించారు. ఎస్ఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను పాటించని వాహనచోదకులపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించరాదని ఆటోడ్రైవర్లకు సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నందిగామటౌన్: పట్టణంలోని 11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం ఫీడర్-4 పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. మరమ్మతుల నేపథ్యంలో ఉదయం ఎనిమిది నుంచి 12 గంటల వరకు నెహ్రూనగర్, రామన్నపేట రోడ్డు, చిన్న మసీదు రోడ్డు, పాత బస్టాండ్, చెరువు బజార్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాధ్యతల స్వీకారం

నందిగామరూరల్: రైతుసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పేర్కొన్నారు. మండలంలోని కొణతమాత్మకూరు సొసైటీ అధ్యక్షునిగా తొర్రగుడిపాడు మాజీ సర్పంచ్ చెరుకూరు సాంబశివరావు సభ్యులుగా దగ్గుపాటి నిర్మల, కాంబోజి కొండాలతో కూడిన త్రిమెన్ కమిటీ బుధవారం బాధ్యతలు స్వీకరించింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన కమిటీలు సొసైటీల అభివృద్ధితోపాటు రైతుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు తోట నాగమల్లేశ్వరరావు, మన్నే కళావతి, చెరుకూరు హైమారావు తదితరులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్



జడ్జి శ్రీనివాసరావు

నందిగామటౌన్: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కృష్ణాజిల్లా ప్రిన్సిపల్ జడ్జి గోపి పర్యవేక్షణలో ఈనెల 13న ఉదయం 10.30 గంటల నుంచి నందిగామ కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు 16వ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం అందుతుందన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే విలువైన సమయం ఆదాకావడంతోపాటు ఖర్చు తగ్గుతుందని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కంచికచర్ల : సైబర్ నేరగాళ్ల బారినపడకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వజీవన్ బాలభవన్ సీఎస్ఎన్ ఏరియా సీఎస్ఎన్ కోఆర్డినేటర్ కొనకాల జగన్ సూచించారు. మండలంలోని మోగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సైబర్ నేరాల బారినపడకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా జగన్ మాట్లాడుతూ ఇతర దేశాలలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని, లాటరీలో బహుమతులు గెలుచుకున్నారంటూ అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే మేసేజ్‌లను నమ్మవద్దన్నారు. బ్యాంకు అకౌంట్ ఈకేవైసీ చేయించుకోవాలని, ఇన్‌కం టాక్స్ చెల్లింపుల పేరుతో సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్లు వస్తే ఆ సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. . అనంతరం సైబర్ నేరగాళ్ల ఆన్‌లైన్ మోసాలబారిన పడబోమని ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన 'మార్త'

కంచికచర్ల: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు మార్త శ్రీనివాసరావు బుధవారం తాడేపల్లిలో కలిశారు. బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌యాదవ్‌తో కలిసి మార్త శ్రీనివాసరావు జగన్‌ను కలిశారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం కష్టపడి పనిచేయాలని మాజీ సీఎం జగన్ సూచించినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

శాస్త్రవేత్తల సలహాలతో అధిక దిగుబడులు



గరికపాడు(జగ్గయ్యపేట): పంటల సాగులో రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు పాటించాలని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కోఆర్డినేటర్ రవికిషోర్ సూచించారు. గరికపాడు కేవీకేలో రైతులకు బుధవారం క్షేత్రస్థాయి పంటల సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలసాగులో రైతులు, వ్యవసాయశాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. సమతుల ఎరువుల యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో వరలక్ష్మి, శాస్త్రవేత్తలు శివప్రసాద్, రాజశేఖర్, గ్రామీణ విస్తరణ సహాయకురాలు నవ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ




జగ్గయ్యపేటఅర్బన్: ఈనెల 14వ తేదీన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న హిందూ న్యాయవాదుల ధర్మ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని జగ్గయ్యపేటకు చెందిన పలువురు న్యాయవాదులు పిలుపునిచ్చారు. న్యాయవాదులు బుధవారం కోర్టు ధర్మసమ్మేళనం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు సామినేని వెంకటేశ్వరరావు, పసుపులేటి సత్యశ్రీనివాసరావు, గోనెల వెంకటేశ్వర్లు, టీఎల్.నరసింహారావు, అన్నెపాగ ప్రఫుల్ల శ్రీకాంత్, గండికోట శ్రావణ్‌కుమార్, డి.కృష్ణ, రవి, మహంతి, అంకమరాజు, చిన్న గాంధీ, గురువుల రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



గౌరవరం(జగ్గయ్యపేట): విద్యార్థులు విద్యలో వస్తున్న అత్యాధునిక పద్దతులపై అవగాహన కలిగి ఉండాలని లయన్స్ ఇంటర్‌నేషనల్ వైస్ చైర్మన్ ఎర్రంరెడ్డి గాంధీ సూచించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిది, తొమ్మిది, పదోతరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని అందుకనుగుణంగా ముందుకు సాగాలన్నారు. ముఖ్యంగా విద్యార్థి స్థాయి నుంచే కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలన్నారు. గెలుపు ఓటములను కూడా సమానంగా తీసుకోవాలని సూచించారు. క్లబ్ ప్రతినిధులు చెరుకుమల్లి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయురాలు గద్దె సూర్యకుమారి, ఉపాధ్యాయులు మహేశ్వర వెంకటేశ్వరరావు, పూసపాటి కవిత, రాజేష్, కృష్ణారావు పాల్గొన్నారు.

చెత్త సమస్య పరిష్కారానికి చర్యలు :ఎమ్మెల్యే



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని విలియంపేట వద్ద ఉన్న చెత్త డంపింగ్ యార్డులోని వ్యర్థాలను తొలగించే ప్రక్రియ గురువారం నుంచి మొదలవుతుందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) తెలిపారు. ఈ వ్యర్థాలను తొలగించే అత్యాధునిక యంత్రాన్ని మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్రతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర పైలట్ ప్రాజెక్ట్ కింద జగ్గయ్యపేటను ఎంచుకొని అత్యాధునిక యంత్రాన్ని జగ్గయ్యపేటకు పంపించినట్లు తెలిపారు. ఇప్పటికే పేరుకుపోయిన పొడిచెత్తతో పాటు రానున్న కాలంలో వచ్చే పొడిచెత్తను కూడా ఈ యంత్రం ద్వారా శుభ్రం చేయిస్తామని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ నకిరికంటి వెంకట్, మున్సిపల్ ఏఈ హనుమంతరావు, కంట్రాక్టర్ చిరంజీవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లు నూరుశాతం పూర్తిచేయాలి : డీఎల్‌పీఓ



కంచికచర్లలో ఇంటి పన్నుల వివరాలు తెలుసుకుంటున్న డీఎల్‌పీఓ రాఘవన్

కంచికచర్ల: ఈనెలాఖరులోగా ఇంటిపన్నుల వసూళ్లను వందశాతం పూర్తిచేయాలని డీఎల్‌పీఓ జీఎల్ఎస్‌వీ రాఘవన్ ఆదేశించారు. కంచికచర్ల గ్రామ పంచాయతీని బుధవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణ పంచాయతీ లింక్ ద్వారా ఇంటి యజమాని ఇంటి వద్ద నుంచే పన్నులు చెల్లించేలా వారికి అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. పాత బకాయిలను వసూలు చేయాలన్నారు. మాల్లో శానిటేషన్ పనులు చేపట్టాలని, వెలగని వీధిదీపాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలన్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు, పరిసరాల పరిశుభ్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. స్వర్ణ పంచాయతీ లింక్ ద్వారా ఇంటి పన్నులు సులువుగా చెల్లించే విధానంపై డ్వాక్రా సంఘ సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ వెల్లంకి రామారావు, జూనియర్ అసిస్టెంట్ బ్రహ్మచారి, సూదుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యూరియా కోసం క్యూ కట్టిన రైతులు



శనగపాడులో వేచి ఉన్న రైతులు



కొళ్లికూళ్లలో యూరియా కోసం వేచి ఉన్న రైతులు

శనగపాడు,కొళ్లికూళ్ల(పెనుగంచిప్రోలు): యూరియా కోసం మండలంలోని శనగపాడు, కొళ్లికూళ్ల సొసైటీ కార్యాలయాల వద్ద రైతులు బుధవారం క్యూ కట్టారు. ఉదయం నుంచే సొసైటీల వద్ద రైతులు యూరియా కట్టలు కోసం ఎదురుచూశారు. శనగపాడులో 15 టన్నులు, కొళ్లికూళ్లలో 15 టన్నులు, పెనుగంచిప్రోలు సొసైటీలో 25 టన్నులు రైతులకు యూరియా సరఫరా చేసినట్లు మండల వ్యవసాయాధికారి రామసుబ్బారెడ్డి తెలిపారు. అయితే పంటలను కాపాడుకునేందుకు అవసరమైన యూరియా అందుబాటులో లేకపోవడంతో యూరియా కోసం రైతులు గంటల తరబడి ఆయా సొసైటీల వద్ద వేచి ఉండక తప్పడం లేదు. అయినప్పటికీ సరిపడిన మేర యూరియాను అందించడంలో రాష్ట్రప్రభుత్వం ఘోరంగా విఫలమవుతుండటంపై రైతులు పెదవి విరుస్తున్నారు.

లేబర్ కోడ్‌ల రద్దుకు డిమాండ్



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

జగ్గయ్యపేటఅర్బన్: లేబర్ కోడ్‌లను రద్దుచేయడంతోపాటు కార్మికులకు కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. డీవీఆర్ నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం జగ్గయ్యపేట సీఐటీయూ మండల 8వ మహాసభను నిర్వహించారు. ఈ మహాసభకు సీఐటీయూ మండల అధ్యక్షురాలు డి.సుధారాణి అధ్యక్షత వహించగా, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎ.కమల మాట్లాడుతూ కార్మికులను, ఉద్యోగులను మరింత అభద్రతలోకి నెట్టివేస్తున్న లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, సమాన పనికి సమాన వేతనం, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు తదితర రంగాల వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎన్నిక...

సీఐటీయూ జగ్గయ్యపేట మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా డి.సుధారాణి, షేక్ గౌస్‌మియా, కోశాధికారిగా బత్తుల బుజ్జితోపాటు 21 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల గౌరవాధ్యక్షురాలు సోమోజు నాగమణి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ అల్లాబీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పారా ఎలకమ్మ, గుణసుందరి, షేక్ బాజీ, పద్మ, రామారావు పాల్గొన్నారు.

ఏఐ టూల్స్‌పై ముగిసిన వర్క్‌షాపు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్

కంచికచర్ల: మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)టూల్స్‌పై మూడు రోజులుగా నిర్వహిస్తున్న 'హ్యాండ్స్ అన్ వర్క్‌షాప్' బుధవారంతో ముగిసింది. ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కె.రామ్మోహనరావు మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా అప్‌డేట్ కావాలని, ఇండస్ట్రీ అవసరాలకు తగినట్లుగా సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. ప్రస్తుత ప్రపంచాన్ని ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) శాసించనుందని, అటువంటి టెక్నాలజీపై పట్టు సాధిస్తే ఉద్యోగా వకాశాలు మెండుగా ఉంటాయని పేర్కొన్నారు. బెంగుళూరుకు చెందిన బ్రాంచ్ రిసోర్స్‌పర్సన్స్ అండ్ టెక్నికల్ ట్రైనర్లు కె.బాలవీర నాగదశరథ, టీ శివశేషు మాట్లాడుతూ ఏఐలో మెళకువలతోపాటు మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, ఎన్ఎల్‌పీలో డెమోస్ ప్రెజెంటేషన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ కార్యకలాపాల పరిశోధనలో అనేక సవాళ్లను సమస్యలను పరిష్కరించడంలో ఏఐ సహాయ పడుతుందని వివరించారు. కార్యక్రమంలో సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ పి.చిరంజీవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనసత్కారం



జగ్గయ్యపేటఅర్బన్: వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి బత్తుల రామారావు ఇటీవల పల్నాడు జిల్లా బీసీ విభాగం ఇన్‌చార్జిగా నియమితులైన నేపథ్యంలో ఆయనను ఆపార్టీ జగ్గయ్యపేట ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు బుధవారం ఘనంగా సత్కరించారు. పార్టీ అభివృద్ధికి మరింత కృషిచేయాలని సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆపార్టీ వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు డేరంగుల శ్రీనివాసరావు, పెనుగంచిప్రోలు గ్రామ పార్టీ అధ్యక్షుడు గుడిమెట్ల శంకర్, జగ్గయ్యపేట పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్, పెనుగంచిప్రోలు సోషల్ మీడియా కోఆర్డినేటర్ ధార గౌతమ్, అనిగండ్లపాడు యూత్ నాయకులు మురికిపూడి మాస్ పాల్గొన్నారు.